సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 12 । నవంబర్ । 2024



..అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం

కేటీపీఎస్ క్వార్టర్లను ఇతర శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు తక్కువ అద్దెకు ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. 8లో



..ఉద్యోగ దరఖాస్తులు ఇవ్వొద్దు

ఐటీడీఏలో నిర్వహించే గిరిజన దర్బార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఇవ్వొద్దని పీఓ రాహుల్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 22°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం ప్రారంభమయ్యే ఎండ మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అసాంఘిక శక్తులపై ప్రజలకు అవగాహన

మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

పినపాక: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టడమే కాక అసాంఘిక శక్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వరంగల్ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఈ – బయ్యారం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆతర్వాత నూతన పోలీసుస్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నిఘా మరింతగా పెంచాలని, ఏజెన్సీ ప్రాంత పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు. మారుమూల గ్రామాల యువత అసాంఘిక కార్యక్రమాల వైపు మళ్లకుండా విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పోలీసులు పాలుపంచుకోవాలని తెలిపారు. ఈ – బయ్యారం సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో పరిశీలించిన జెన్‌కో డైరెక్టర్



కర్మాగారంలో పరిశీలిస్తున్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య, అధికారులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారాన్ని టీజీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కర్మాగారంలోని యూసీబీ, కోల్ ప్లాంట్లలో పర్యటించి విద్యుత్ ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. ఉత్పత్తికి అవాంతరాలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆతర్వాత సీఈ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. కాగా, డైరెక్టర్ మంగళవారం కేటీపీఎస్ 5,వ 6వ దశల్లో పర్యటించనున్నారు. సీఈ పి.వెంకటేశ్వర్‌రావు, ఎస్‌ఈలు రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, యుగపతి, కిరణ్‌కుమార్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

రామాలయ ఏఈఓకు మళ్లీ పోస్టింగ్ ?

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఏఈఓగా పనిచేసి సస్పెండ్ అయిన శ్రవణ్‌కుమార్‌కు మళ్లీ పోస్టింగ్ వచ్చినట్లు సమాచారం. గతంలో రామాలయ మొదటి ఏఈఓగా పనిచేస్తున్న శ్రవణ్‌కుమార్ భక్తుల వసతి గృహ నిర్మాణం కోసం సేకరించిన నిధుల్లో అవకతవకలకు పాల్పడ్డాడని ఓ సంస్థ బాధ్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ రమాదేవి శ్రవణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. దీనిపై ఆయన వివరణ అనంతరం, విచారణ జరిపిన అధికారులు తిరిగి ఆలయ ఏఈఓగా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బాలాజీ నాయక్



బాలాజీనాయక్‌కు నియామక పత్రం అందిస్తున్న ఏలూరి శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్ : ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు బాలాజీనాయక్‌ను ఎంపిక చేశారు. ఆయనకు తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు.

కేటీపీఎస్‌లో నిలిచిన ఉత్పత్తి

పాల్వంచ: సాంకేతిక సమస్య తలెత్తడంతో కేటీపీఎస్ 5వ దశలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం గల పదో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడటంతో అధికారులు గుర్తించి వెంటనే ఉత్పత్తిని నిలిపేశారు. అనంతరం సీఈ ఎం.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు.

అటవీ ఠాణాల ఏర్పాటెప్పుడో..?



కేరళ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ స్టేషన్

అడవులు, జంతువులు, అటవీ భూముల సంరక్షణతో పాటు దాడులను ఎదుర్కొనేందుకు అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలతో కూడిన ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి జిల్లా అటవీ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 10,13,460 హెక్టార్ల మేర అడవులు విస్తరించి ఉండగా, ఆరు అటవీ డివిజన్లు ఏర్పాటు చేశారు. ఇందులో వన్యప్రాణి సంరక్షణ కోసం పాల్వంచలో ప్రత్యేకంగా కిన్నెరసాని అభయారణ్యం ఉంది. గోదావరి, కిన్నెరసాని నదులకు ఇరువైపులా అటవీ ప్రాంతం విస్తరించి ఉండడంతో అటవీ భూములు, వన్యప్రాణి సంరక్షణకు అటవీ హక్కుల చట్టాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగులు.. ఒక్కోసారి దాడులను కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే 2022 నవంబర్ 22న చంద్రుగొండ రేంజ్‌లో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు పోడు రైతుల దాడిలో హతమయ్యారు.

– పాల్వంచరూరల్

జిల్లాలో నాలుగు స్టేషన్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు

- అధికారులు, సిబ్బందికి ఆయుధాలు అందించాలని వినతి
- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఫారెస్ట్ స్టేషన్లు
- అక్కడి అధికారులకు అధునాతన వాహనాలు కూడా..

పోడు సాగుతోనే సమస్య..

జిల్లాలో పోడు భూముల అంశం అటవీ శాఖకు తలనొప్పిగా మారింది. పోడు సాగుతో అటవీ భూముల సంరక్షణ సమస్యగా మారిందని ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోడు సాగుదారులను అడ్డుకునే క్రమంలో అనేక చోట్ల అటవీ సిబ్బంది, అధికారులపై దాడులు చోటుచేసుకుంటున్నాయి. మరో వైపు వన్యప్రాణులకు నిలయమైన అభయారణ్యంలో అంతర్రాష్ట్ర స్మగ్లర్లు సంచరిస్తూ అటవీ జంతువులను వివిధ పద్ధతుల్లో వధించి గుట్టుగా తరలిస్తున్నారు. రెండేళ్ల క్రితం జిల్లా అటవీ ప్రాంతంలో సంచరించే అరుదైన అలుగు జంతువును అంతర్రాష్ట్ర స్మగ్లర్లు చంపి ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా అటవీ అధికారులు పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. పోడు సాగు చేసే వలస గిరిజనులు, గొత్తికోయలతో పాటు స్మగ్లర్ల నడుమ అడవుల్లో విధులు నిర్వర్తించాలంటే సిబ్బంది భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ స్టేషన్లను ఏర్పాటు చేసి అటవీ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో అన్ని జిల్లాల సర్కిల్ హెడ్లు, డీఎఫ్‌ఓలు, ఎఫ్‌డీఓలతో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ నిర్వహించిన రెండు రోజుల సమావేశంలో అటవీశాఖ అధికారులు ఇదే సమస్య లేవనెత్తారు. అడవుల్లో స్టేషన్లు ఏర్పాటు చేయాలని, గతంలో వలె అటవీ సిబ్బందికి మళ్లీ ఆయుధాలు ఉపయోగించే అవకాశం కల్పించాలని విన్నవించారు. దీనికి పీసీసీఎఫ్ కూడా సానుకూలంగా స్పందించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు.

1993 వరకు ఆయుధాలు..

జిల్లాలోని అటవీ శాఖ అధికారులు 1993 వరకు ఆయుధాలు కలిగి ఉన్నారు. అయితే అప్పుడు నక్సల్స్ సమస్య జిల్లాలో తీవ్రంగా ఉండడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఆయుధాలతో పాటు ప్రతి డివిజన్ కార్యాలయంలో వైర్‌లెస్ సెట్లు కూడా ఉండేవి. వాకీటాకీల ద్వారా అటవీ సిబ్బందికి సమాచారం అందించేవారు. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత ఈ వ్యవస్థ కనుమరుగైంది.

పలు రాష్ట్రాల్లో ఆయుధాలు, ప్రత్యేక స్టేషన్లు..

దేశంలోని తెలంగాణ మినహా అటవీ ప్రాంతం విస్తారంగా ఉన్న కేరళ, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలతోపాటు, ప్రత్యేక ఫారెస్ట్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. తద్వారా ఆయా సిబ్బంది అటవీ సంరక్షణను కొనసాగిస్తున్నారు. ఆయుధాలు, స్టేషన్లు కాక అధునాతమైన వాహనాలు సైతం ఆయా రాష్ట్రాల్లో అటవీ శాఖ ఎఫ్‌డీఓ, రేంజర్లకు కేటాయించారు.



కేరళలో అధికారికి కేటాయించిన వాహనం



ఆయుధాలతో జార్ఖండ్ అటవీ శాఖ సిబ్బంది

నాలుగు ఫారెస్ట్ స్టేషన్లకు ప్రతిపాదనలు



జిల్లా అటవీ ప్రాంతంలో నాలుగు ఫారెస్ట్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాం. అశ్వాపురం రేంజ్, కిన్నెరసాని అభయారణ్యంలోని రేగళ్ల అటవీ ప్రాంతం, చర్ల, మణుగూరు రేంజ్‌లో ఫారెస్ట్ స్టేషన్ల ఏర్పాటుకు పీసీసీఎఫ్, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఒక్కో స్టేషన్‌లో 18 మంది ఫారెస్ట్ సిబ్బందితోపాటు ఆర్మీ సిబ్బంది కూడా విధులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాం. – కృష్ణగౌడ్, డీఎఫ్‌ఓ

శివయ్యకు చందనోత్సవం

- ముత్తంగి అలంకరణలో రామచంద్రస్వామి
- గోదారమ్మకు నదీ హారతి
- ప్రచారం లోపంతో భక్తుల నిరాశ



శివాలయంలో చందనోత్సవం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: కార్తీక సోమవారం సందర్భంగా శివయ్యకు భక్తి శ్రద్ధలతో పూజలు జరిగాయి. శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ ఉమాసమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సోమవారం శివాలయంలో పూజలు జరిపేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా శివలింగానికి సోమవారం చందనోత్సవం, ప్రత్యేక పూజలు చేశారు. రామాలయ వేద పండితులు సన్యాసిశర్మ ప్రవచనం, భక్తి, శాస్త్రీయ నృత్య కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేవస్థాన ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి గోదావరి తీరంలో ఆలయ అధికారులు నదీ హారతి నిర్వహించారు.

ప్రచార లోపం..

ప్రతి ఏడాది కార్తీక మాసంలో ఓ పుణ్యతిథి రోజున గోదారమ్మకు నదీ హారతి సమర్పించడం ఆనవాయితీ. కాగా, ఈనెల 24వ తేదీన ఆ వేడుక నిర్వహణకు ఆలయ అధికారులు, వైదిక కమిటీ సభ్యులు నిర్ణయించారు. అయితే అనూహ్యంగా దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా గత రెండు సోమవారాల్లో సాయంత్రం వేళ నదీ హారతి ఇచ్చారు. దీనిపై ఎలాంటి ప్రచారం, ముందస్తు సమాచారం లేకపోవడంతో ఈ వేడుక సాదాసీదాగా సాగింది. కార్తీక సోమవారం రోజున సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున గోదావరి పుణ్యస్నానాలకు వస్తుంటారు. కనీసం ఆ ఒక్క రోజు ఉదయం నుంచి ప్రచారం చేసినా.. ఈ వేడకకు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండేది. కానీ ఆలయ అధికారులు ఇష్టారీతిగా ఎలాంటి ప్రచారం లేకుండా నిర్వహిస్తుండడంతో ఈ వేడుక తూతూ మంత్రంగా కొనసాగుతోంది.

ముత్తంగి అలంకరణలో రామయ్య..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ముగిసిన జాతీయ నృత్య పోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులతో జడ్జి భానుమతి

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ 'ఎ' కాలనీ సీతారామ కల్యాణ మండపంలో సంతోషిని నాట్య నిలయం వ్యవస్థాపకురాలు రమాదేవి రామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రశైల జాతీయ నృత పోటీలు ఆదివారం ముగిశాయి. సబ్ జూనియర్స్ విభాగంలో టి.జాగ్రవి ప్రథమ, యష్వర్ధిక పూజారి ద్వితీయ, టి.నైనిక తృతీయ, ఎస్.రిత్విక, అదితి మాన్య, సీహెచ్.మధున కన్సోలేషన్, జూనియర్స్ విభాగంలో టి.తేజస్విని ప్రథమ, ఎస్‌వీకె.యషస్విని ద్వితీయ, సీఆర్.జానవి తృతీయ, ఎం.మోక్షశ్రీ, గీతా శ్రీ, రుతికా వైష్ణో కన్సోలేషన్, సీనియర్స్ విభాగంలో శ్రీసాయి మృదుల ప్రథమ, టి.భావ్య ద్వితీయ, ఎ.శ్వేత వర్షినా తృతీయ, పి.స్నిగ్ధ గాయత్రి, బి.కార్తిక, ఎం.తరుణి కన్సోలేషన్, గ్రూప్స్ విభాగంలో గాయత్రి టీం ప్రథమ, హేమ శ్రీ హర్షిత టీం ద్వితీయ, భావ్య టీం తృతీయ, యోషిత టీం, శ్వేత టీం, ధన్వి టీంలు కన్సోలేషన్ బహుమతులు సాధించారు. వీరికి జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, కేటీపీఎస్ సీఈ పి.వెంకటేశ్వరరావు, జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాస బాబు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, న్యాయవాది రాంప్రసాద్, రమాదేవి రామ్, పోటీల జడ్జి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లా ఎంపిక

కొత్తగూడెంరూరల్ : గిరిజనులకు వైద్య సేవలు మెరుగుపర్చడానికి, ఆరోగ్యశ్రీ ద్వారా అందించే వైద్య సేవలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయడానికి పైలెట్ ప్రాజెక్ట్‌గా భద్రాద్రి, సంగారెడ్డి జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసిందని డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ తెలిపారు. ఐడీఓసీలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం సేవలు అమలు చేయాలని సూచించారు. సమావేశంలో వైద్యశాఖ అధికారులు కార్తీక్‌రెడ్డి, మాధవరావు, చంద్రశేఖర్, ప్రసాద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసే దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పలువురి నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. దరఖాస్తుల్లో కొన్నింటి వివరాలిలా..

- కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం 12వ వార్డులో నివాసం ఉంటున్న బొంకూరి శంకర్ చిట్టి రామవరం వెళ్లే దారిలో పీరీల మసీదు వెనుక ఇంట్లో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, తమ ఇంటి గోడకు కాలనీ వాసులు చెత్త వేయడంతోపాటు ఆస్పత్రి వ్యర్థాలు వేయడంతో అనారోగ్యానికి గురవుతున్నామని ఫిర్యాదు చేయగా పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- చర్ల మండలం గోగుపాకలో నివాసం ఉంటున్న నలపరాజు వెంకట సత్య నీలాద్రివర్మ.. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ భూమి తీసుకున్నారని, ఇంత వరకు నష్ట పరిహారం అందించలేదని విన్నవించగా ల్యాండ్ అక్విడేషన్ అధికారులకు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెంలోని రామాంజనేయకాలనీ పరిధిలోని సైనిక్‌పూరిలో పల్లెప్రగతి కోసం కేటాయించిన భూమిని కబ్జాదారులు ఆక్రమణ చేసి ప్లాట్లుగా విభజించి అమ్ముకున్నారని, గదులు వేసుకుని ఇంటి నంబర్లు కూడా తెచ్చుకున్నారని, ఈ విషయంపై గతంలో ఫిర్యాదు చేసినా, సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదని రైటర్‌బస్తీ గొల్లగూడెం నివాసి కంచం నాగయ్య ఫిర్యాదు చేశారు. దీన్ని ఆర్డీఓకు ఎండార్స్ చేశారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి..

భారతరత్న పురస్కార గ్రహీత, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ విద్యావ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు, పరిపాలనా దక్షుడు అబుల్ కలాం అని కొనియాడారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలు అందించారని ప్రశంసించారు. మైనార్టీల అభ్యున్నతికి కూడా కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా మైనార్టీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల ఫలితాలు విడుదల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో అక్టోబర్‌లో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, ఏసీజీఈ మాధవరావు తెలిపారు. పదో తరగతిలో 359 మంది విద్యార్థులకు 62 మంది(17.27 శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఇంటర్‌లో 357 మందికి 190 మంది (53.22 శాతం) ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. పరీక్ష ఫలితాలను www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో చూడవచ్చని, రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కావాల్సిన అభ్యర్థులు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వెబ్‌సైట్, మీ–సేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్ చేయాలంటే ఇంటర్ వారు రూ.400, పదో తరగతి వారు రూ.350 చెల్లించాలని, రీ వెరిఫికేషన్, ఆన్సర్ షీట్ జిరాక్స్ కాపీ కావాలంటే రెండు తరగతుల వారూ రూ.1200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

బీమాతో మరింత ధీమా..

- స్వశక్తి సంఘాలకు రుణ, ప్రమాద బీమా
- డ్వాక్రా మహిళల కుటుంబాలకు ప్రయోజనం
- జిల్లాలో 18, 244 స్వయం సహాయక సంఘాలు



సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు

చుంచుపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. అధిక వడ్డీ రుణ భారం నుంచి మహిళా స్వయం సహాయక సభ్యులను రక్షించడానికి బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణ పథకం సైతం అమల్లో ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాశక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందిస్తూ మరింతగా ప్రోత్సహిస్తోంది. వారి కుటుంబాలకు భరోసాగా నిలిచేందుకు అతివలకు బీమా పథకాలను సైతం అమల్లోకి తెచ్చింది. స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉచితంగా రుణబీమా, ప్రమాదబీమా పేరుతో రెండు రకాల ప్రయోజనాలు కల్పిస్తోంది. పొదుపు సంఘం సభ్యురాలు మృతిచెందితే రుణం చెల్లించడం కుటుంబసభ్యులకు భారంగా మారుతోంది. అలాగే అప్పు తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థికసాయం అందనుంది. ఇవి వారి కుటుంబాలకు అండగా నిలవనున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ రెండు బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వీటిలో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా గ్రూప్ సభ్యులు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వివరాలు ఉండాలి. అయితే ఇలాంటి బీమా పథకాలపై మహిళా సంఘాల్లో అవగాహన లేదు. రుణం పొందే సమయంలో మాత్రమే వీవోలు వివరాలు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో 1,80,213 మందికి ప్రయోజనం..

జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో 18, 244 స్వయం సహాయక సంఘాల పరిధిలో 1,80,213 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చిరు వ్యాపారాలు చేసేలా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలు అందజేస్తున్నారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళ కోసం రుణ, ప్రమాద బీమా అమలు చేస్తోంది. దీనికి మహిళా సంఘాల సభ్యులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. పొదుపు సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఉచిత బీమా వర్తింపజేస్తారు. 100 శాతం వైకల్యం కలిగినా రూ.10 లక్షలు అందిస్తారు. ప్రమాదంలో 50 శాతం వైకల్యం కలిగితే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళలకు పొదుపు అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలుపుతూ సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆస్పత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రమాద బీమా సౌకర్యం 18 నుంచి 60 ఏళ్ల వయసున్న పొదుపు మహిళలకు వర్తిస్తుంది. ఇక రుణ బీమా ద్వారా రూ.2 లక్షల వరకు ప్రయోజనం కలుగుతుంది. గ్రూపుగా ఒక్కో సంఘానికి రూ.5 నుంచి రూ.20 లక్షల వరకు ప్రస్తుతం రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది. అలా చెల్లించకపోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణ బీమా వర్తింపజేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ఇక నుంచి ప్రభుత్వం మాఫీ చేయనుంది.

కుటుంబాలకు ఎంతో ప్రయోజనం



స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండురకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వారి కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. దీనిపై జిల్లాలోని మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– డి.నీలయ్య, అదనపు డీఆర్‌డీఓ(సెర్ప్)

క్లుప్తంగా

బయోమైనింగ్ కేంద్రం ప్రారంభం



బయోమైనింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇల్లెందు: పట్టణంలో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి, ఎరువులను తయారు చేసే బయోమైనింగ్ ప్లాంట్‌ను ఇల్లెందులో ప్రారంభించటం అభినందనీయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బైపాస్ రోడ్‌లోని డీఆర్‌సీసీ భవన్‌లో జిల్లాలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన బయోమైనింగ్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోజుకు రెండు మూడు టన్నులు చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అణువుగా మిషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, డీఈ మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, జవాన్ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ యలమందల వాసు, పట్టణ కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలి

జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్



అయన్నపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న సీఈఓ చంద్రశేఖర్

చండ్రుగొండ: కుటుంబ సమగ్ర సర్వేలో తప్పులు దొర్లకుండా సూపర్‌వైజర్లు, మండలస్థాయి అధికారులు పర్యవేక్షించాలని జిల్లా పరిషత్ సీఈఓ చంద్రశేఖర్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మండల అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేపై సమీక్షించాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అయన్నపాలెం గ్రామంలో సర్వే తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా సావిత్రి



గోపీచంద్‌ను సన్మానిస్తున్న సావిత్రి తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా సింగరేణి మహిళా కళాశాల పీడీ సావిత్రి ఎంపికయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈ నెల 9న బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 10 జిల్లాల అధ్యక్షకార్యదర్శులను ఎన్నుకున్నారు. భద్రాద్రి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఇంటూరి రవికుమారి(పాల్వంచ), ఉపాధ్యక్షుడిగా ఎం శ్రీనివాసరావు (భద్రాచలం), కార్యదర్శిగా డాక్టర్ కె.సావిత్రి (కొత్తగూడెం), సహాయ కార్యదర్శిగా పి.హరిప్రసన్న కుమార్ (భద్రాచలం), కోశాధికారిగా కుంచాల రమేష్(భద్రాచలం)తో పాటు 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్‌ను సన్మానించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

క్వార్టర్ల అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం

- ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు తక్కువ అద్దెతో కేటీపీఎస్ క్వార్టర్లు
- ఆ అద్దె కూడా చెల్లించకుండా బదిలీపై వెళ్లిపోతున్న అధికారులు
- ఫలితంగా రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- కేటీపీఎస్ అధికారుల పట్టింపులేని తనంతోనే ఈ పరిస్థితి



కేటీపీఎస్ కాలనీలోని క్వార్టర్లు

పాల్వంచ: పాల్వంచలో కేటీపీఎస్ కర్మాగారానికి చెందిన క్వార్టర్లను ఇతర శాఖల ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు తక్కువ అద్దెకు కట్టబెడుతుండటంతోపాటు ఆ అద్దె కూడా వసూలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. అతి తక్కువ అద్దెతో క్వార్టర్లు పొందినవారు ఉద్యోగులు అది కూడా చెల్లించకుండానే బదిలీపై వెళ్లిపోతున్నారు. అద్దె వసూలు చేయాల్సిన సివిల్ విభాగం అధికారులు నిర్లక్ష్యంతో జెన్‌కో సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోంది. ఇప్పటివరకు బకాయిలు సుమారు రూ.70 లక్షల మేర పేరుకుపోయినట్లు సమాచారం. 2011 సంవత్సరం వరకు 2024 వరకు అద్దె బకాయిలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.

మొదట వినతి.. ఆ తర్వాత బకాయి

కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికుల కోసం జెన్‌కో సంస్థ ఉచిత కరెంట్, నీటి వసతి కల్పిస్తూ పలుచోట్ల క్వార్టర్లను నిర్మించింది. కేటీపీఎస్ 'ఏ' కాలనీ, 'బీ' కాలనీ, 'సీ' కాలనీ, జెన్‌కో కాలనీ, బాంబే కాలనీలుగా ఇవి ఉన్నాయి. అయితే ఉద్యోగుల కేడర్ ఆధారంగా క్వార్టర్ల విస్తీర్ణం, వసతులు, ఇతర ఏర్పాట్లు ఉంటాయి. ఎపాల్వంచ కేంద్రంగా విధులు నిర్వర్తించే రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, ప్రజాప్రతినిధులకు వారి వినతితో క్వార్టర్లను తక్కువ అద్దెతో కేటాయిస్తున్నారు. ఇందులో ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ ఉద్యోగులు, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు, ఎఫ్‌ఆర్‌ఓలు, వైద్యులు, ఎస్‌పీఎఫ్ పోలీసు అధికారులు, బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు ఉంటారు. ఇక పోస్టాఫీస్, బ్యాంకుల అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లతో కేటాయించిన క్వార్టర్లలో కొందరు బినామీలు పాల బూత్‌లు, క్యాంటీన్లు నిర్వహిస్తుండగా.. ఇంకొన్ని క్వార్టర్లలో కాంట్రాక్టర్లు నివాసం ఉండటం సాధారణంగా మారింది. వీరికి అన్ని రకాల వసతులు కలిగిన క్వార్టర్లను రూ.5, రూ.4వేల లోపు అద్దెకు క్వార్టర్లు ఇచ్చారు. కానీ ఉన్నప్పుడు అద్దె చెల్లించకపోగా బదిలీ కాగానే ఇక్కడ క్వార్టర్లు అప్పగించకుండా ఖాళీ చేసి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. అనేక ఏళ్లుగా ఇలాగే కొనసాగుతుండగా వారిని అడిగే వారే కరువయ్యారు. ఫలితంగా అద్దె బకాయిలు రూ.70 లక్షల వరకు పేరుకుపోయాయని సమాచారం. చాలా క్వార్టర్ల అద్దె రూ.80వేల నుంచి రూ.1.20 లక్షల వరకు బకాయి ఉన్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

సిబ్బందికైతే వేతనంలో హెచ్‌ఆర్‌ఏ కోత

క్వార్టర్లలో నివాసముండే కేటీపీఎస్ సిబ్బందికి జీతంలోనే హెచ్‌ఆర్‌ఏ(హౌస్ రెంట్ అలవెన్స్) ఎప్పటికప్పుడు కోత విధిస్తారు. ఒక్కో ఉద్యోగి కేడర్, క్వార్టర్‌లో వసతుల ఆధారంగా రూ.5వేల నుండి రూ.25వేల వరకు వేతనంలో మినహాయించుకుంటున్నారు. కాలనీలో ఉండే ఆహ్లాద వాతావరణం, సౌకర్యాల పరంగా చూస్తే అద్దె భరిస్తున్నారు. పాత ప్లాంట్ నిర్మాణ సమయంలో నిర్మించిన క్వార్టర్లలో చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. వీటికి మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంతో సిబ్బందే సొంత డబ్బుతో రిపేర్లు చేయించుకోవాల్సి వస్తోంది. ఇక మిగతా శాఖల అధికారులకు మాత్రం క్వార్టర్లు కేటాయించి అద్దె కూడా వసూలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్, ఆడిట్ అధికారుల నిర్లక్ష్యం వల్లే బకాయిలు పేరుకుపోయాయనే వాదన ఉంది.

బకాయిలు వసూలు చేస్తాం..



క్వార్టర్ల బాకాయిలు రూ.3 లక్షలు, రూ.4 లక్షలకు మించి ఉండవు. అవి కూడా వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం. అప్పట్లో క్వార్టర్లు పొందిన పలువురు అధికారులు ఇక్కడి నుంచి వెళ్లిపోవడం, వారు సకాలంలో అద్దె చెల్లించక పోవడం ఈ పరిస్థితి నెలకొంది.

– పి.వెంకటేశ్వరరావు, సీఈ, కేటీపీఎస్ 7వ దశ

ఒలింపిక్స్‌లోనూ సత్తా చాటాలి..

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 57 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- వైరాలో గురుకులాల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వైరా: రాబోయే ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించాలని.. ఈ దిశగా శిక్షణ ఇచ్చేందుకు 57 ఎకరాల్లో స్పోర్ట్స్ యూవర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం గురుకులాల ఖమ్మం జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ పోటీలను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ గత ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాలు సాధించిన దేశాల్లో క్రీడాకారులకు కన్సల్టెన్సీలుగా వ్యవహరించిన నిపుణులను పిలిపించి స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యరంగాలకు పెద్ద పీట వేసిందని.. రూ.657 కోట్ల నిధులతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గురుకులాల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధిస్తూ, పట్టభద్రులు మరింత రాణించేలా శిక్షణ కోసం 'యంగ్ స్కిల్ ఇండియా' యూనివర్సిటీ స్థాపించామని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, గురుకులాల జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి, డీసీఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే...

వైరారూరల్: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం మొదలైన జోనల్ స్థాయి టోర్నీలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి 14 గురుకుల పాఠశాలల విద్యార్థులు 1,190 మంది హాజరయ్యారు. తొలిరోజు పోటీల్లో విజేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. అండర్–17 విభాగం 1,500 మీటర్ల పరుగులో అక్విల సాయి(ములకలపల్లి), డి.సాగరిక(టేకులపల్లి), పి.కీర్తినందన(వైరా), 800 మీటర్ల పరుగులో బి.హాని(దానవాయిగూడెం), ఎం.హర్షిణి (ఇల్లెందు), డి.సాగరిక(టేకులపల్లి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–19 విభాగం 1,500 మీటర్ల పరుగు పందెంలో ఎస్.భావన(ములకపల్లి), 800 మీటర్ల పరుగులో వి.లావణ్య(కల్లూరు), యు.తేజస్విని(అంబేద్కర్ జూనియర్ కాలేజ్, ఖమ్మం), టి.తేజ(వైరా) మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు.

'దర్బార్'లో ఉద్యోగ దరఖాస్తులు ఇవ్వొద్దు

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలం: ఐటీడీఏలో ప్రతీ సోమవారం జరిగే గిరిజన దర్బార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు సమర్పించొద్దని పీఓ రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగుల నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని చెప్పారు. అయితే, ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసిన సమయాన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, నిరుద్యోగులు ప్రభుత్వం అమలుచేస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుంటే ఇంకొందరికి ఉపాధి కల్పించడమే కాక ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని తెలిపారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన పీఓ పరిష్కారం కోసం అధికారులకు సూచనలు చేశారు. అశ్వారావుపేట మండలం రెడ్డిపల్లికి చెందిన గిరిజనుడు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలో పేరు మార్పు, చర్ల మండలం మామిడిగూడెం గ్రామస్తులు గిరి వికాసం కింద విద్యుత్ మోటార్ల మంజూరు, గుండాల మండలం లింగభూపాలంకు చెందిన 12 మంది గిరిజనులు పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పినపాక మండలం కిష్టాపురానికి చెందిన 45 మంది గిరిజనులు తమ పంట పొలాలకు త్రీ ఫేస్ విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మతో పాటు వివిధ విభాగాల అధికారులు రవీంద్రనాథ్, తానాజీ, భాస్కరన్, సున్నం రాంబాబు, మునీర్ పాషా, ఆర్.లక్ష్మీనారాయణ, ప్రభాకర్ రావు, మణిధర్, నరేందర్, లింగానాయక్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాముడి పాలన కావాలి

ఎమ్మెల్సీ తాతా మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రజలు గడిచిన 11 నెలల్లోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రాక్షస పాలనను చూశారని, మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి కేసీఆర్ సారథ్యంలో రాముడి పాలన కావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. భద్రాచలంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి ముఖ్యమంత్రి, మంత్రులు పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్లామా...అన్ని తలలు పట్టుకుంటున్నారని, వారిని మళ్లీ పార్టీలోకి తీసుకోబోమని చెప్పారు. మూసీ నది అంటూ తిరుగుతున్న టైమ్ పాస్ ముఖ్యమంత్రి రైతుబంధు, రైతు భీమా లేకుండా చేసి రైతుల నోట్లో మట్టి కొట్టాడని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు మానె రామకృష్ణ, సునీల్ కుమార్, పూర్ణ చందర్ రావు, బిక్కసాని శ్రీనివాసరావు, వంశీకృష్ణ, రామకొండరెడ్డి, రాజు, ప్రదీప్, యువరాజ్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలప వాహనంతో ఫారెస్ట్ అధికారులు

అశ్వాపురం: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న కలపను అశ్వాపురంలో ఆదివారం అర్ధరాత్రి ఎఫ్‌ఆర్‌ఓ సిద్ధబోయిన రమేష్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. సుమారు రూ.80 వేల విలువైన కలపను, టాటా ఏసీ వాహనాన్ని పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ధనలక్ష్మి, బీట్ ఆఫీసర్లు బాబూరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనంతారం గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా అశ్వారావుపేటకు అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. కాగా వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఇసుక రవాణా చేస్తున్న రమణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

ఇల్లెందు: పట్టణంలోని కొత్త కాలనీకి చెందిన యువతి అదృశ్యంకాగా, సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కాలనీకి చెందిన ఎ.కిరణ్మయి ఈ నెల 4న రాత్రి 7 గంటల ప్రాంతంలో సామాన్ల కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

ఆస్తుల రక్షణ కోసం పటిష్ట నిఘా

సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ



కార్యాలయంలో పరిశీలిస్తున్న జీఎం లక్ష్మీనారాయణ

ఇల్లెందు: సెక్యూరిటీ సిబ్బంది నిబద్ధతతో పనిచేసి సంస్థ సొమ్ము పక్కదారి పట్టకుండా పర్యవేక్షిస్తూనే ఆస్తులను రక్షించాలని సింగరేణి సెక్యూరిటీ విభాగం జీఎం సీహెచ్.లక్ష్మీనారాయణ సూచించారు. ఇల్లెందు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన కేఓసీ, జేకేఓసీలో సెక్యూరిటీ గార్డులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ప్రతీ ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ఏ చిన్న పొరపాటు చేసినా ఒక్కోసారి కోలుకోలేని నష్టం ఎదురవుతుందని తెలిపారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తొలిసారి వచ్చిన లక్ష్మీనారాయణను ఉద్యోగులు సన్మానించారు. ఏరి యా జీఎం జాన్‌ఆనంద్, ఉద్యోగులు బొల్లం వెంకటేశ్వర్లు, ఈసం కృష్ణయ్య, జీవీ.మోహన్‌రావు, రామదాసు, అంజిరెడ్డి, నాయకుడు కె.సారయ్య పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన సోమవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. ఆసుపాక కాలనీ గ్రామానికి చెందిన పింగుల రాము ఇంట్లో మధ్యాహ్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు అంటుకున్నాయి. దీంతో పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. చుట్టుపక్కల వారి సమాచారంతో ఫైర్ ఇంజన్‌తో అగ్నిమాపక సిబ్బంది వచ్చా రు. అయితే అప్పటికే ఇల్లు దగ్ధమైంది. ప్రమాద సమయంలో బాధితులు వ్యవసాయ కూలి పనులకు వెళ్లగా, చిన్నారులు పాఠశాలకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. మొక్కజొన్న పంట వేసేందుకు ఉంచిన రూ.50వేల నగదుతోపాటు సామగ్రి, దుస్తులు కాలిబూడిదయ్యాయని, సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

మా గ్రామంలో సర్వే చేపట్టాలి

కలెక్టర్, పీఓ, ఎమ్మెల్యేకు సిరిగుండం గ్రామ ఆదివాసీల విన్నపం



భద్రాచలం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం : మండలంలోని నారాయణరావుపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వలస ఆదివాసీ గ్రామం సిరిగుండం గ్రామంలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, భద్రాచలం ఐటీడీఏ పీఓ, భద్రాచలం ఆర్డీఓ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులను కలిసి వినతి పత్రాలు అందించారు. 30 సంవత్సరాల నుంచి సిరిగుండంలో నివాసం ఏర్పరచుకుని కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కనీసం తమను మనుషులుగా పరిస్థితి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు తెలుపగా, రెవెన్యూ మంత్రితో మాట్లాడి సిరిగుండం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సరియం కోటేశ్వరరావు, నాయకులు సోయం నరసింహారావు, ఉబ్బా సీతారామయ్య, సిరిగుండం గ్రామస్తులు సవలం పుల్లయ్య, మడకం రమేష్, మడకం నందా, కోవాసి ఉంగమ్మ, బాడిచే రామలక్ష్మి, మడివి దేవమ్మ, మడకం దేవరాజ్, మడివి సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

అండర్–14 వాలీబాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం స్థాయి అండర్–14 వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపికకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన సోమవారం పోటీలు నిర్వహించారు. జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, వాలీబాల్ కోచ్ ఎం.డీ. అక్బర్ అలీతో పాటు బాలరాజు, నాగరాజు, గోపి, సైదేశ్వర్‌రావు, షఫిక్ అహ్మద్, రాజకుమారిలు పాల్గొన్నారు. కాగా, ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లు ఈనెల 16నుంచి మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. అండర్–14 బాలుర జట్టుకు వై.సందీప్, ఎ.నాగచైతన్య, రిషి వర్మ, బి.నవీన్‌రెడ్డి, ఈ.సన్నీ, ఎం.సాయి అక్షయ్‌కుమార్, కె.రాజు, టి.రామ్‌చరణ్, బి.గణేష్, డి.లోకేష్, ఎం.కరుణాకర్, ఎస్.డీ.అర్షద్. బాలికల జట్టుకు హెచ్.భార్గవి, బి.గౌతమి, బి.సౌజన్య, పి.మేఘహర్ష, ఎస్.అర్షియా, టి.జిన్యాశ్రీ, జె.అక్షియా, ఎ.జోయషిక, ఈ.గాయత్రి, ఈ.దీక్షిత్, సీహెచ్.కోమలి, బి.అనుష, అకృతి ఎంపికయ్యారని వెల్లడించారు.

గోదావరి తీరంలో భక్తుల సందడి



గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన భక్తులు



నదీ తీరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భద్రాచలంటౌన్ : కార్తీకమాసం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు తరలిరావడంతో గోదావరి తీరంలో సందడి నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు నదిలో స్నానమాచరించారు. కార్తీక మాసంలో రెండో సోమవారం కావడంతో మహిళలు గోదారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించి అరటి డొప్పలతో నదిలో విడిచారు. నది ఒడ్డున తులసీ మొక్కను నాటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నదీ తీరంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామివారి ఆలయాలతోపాటు రామాలయంలో పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రామయ్య స్వామివారి దర్శనానికి బారులుదీరాల్సి వచ్చింది. ఉదయం రామాలయ పరిసరాలతో పాటు కరకట్టపైనా వాహనాలు బారులుదీరాయి. పట్టణంలోని పలు శివాలయాల్లో కూడా భక్తులు దీపాలు వెలిగించగా, భద్రగిరిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలింపు

దుమ్ముగూడెం : మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని మట్ట ధనలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంగతి తెలిసిందే. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మెరుగైన వైద్యం కోసం అధికారులు ప్రభుత్వ అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగూడెం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మాడె వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మాణిక్యారం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామం నుంచి ఇల్లెందుకు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో గుండాల మండలం మర్కోడు గ్రామానికి చెందిన శ్రీనాథ్, వసంతరావులు మరో బైక్‌పై ఇల్లెందు నుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో మామిడిగూడెం మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొనగా, ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఒకరిని ఖమ్మానికి, ఇద్దరిని కొత్తగూడేనికి సిఫారసు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి...

ములకలపల్లి: తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మంగపేట శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మీగడ రాంబాబు మంగపేట గ్రామ సమీపంలో భూమి కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో చేలోకి వచ్చిన కోతలను తరిమేందుకు పరిగెత్తుతుండగా సమీపంలోని తేనెటీగలు దాడి చేశాయి. దీంతో రాంబాబు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.